Prof. Kothapally Jaya Shankar Memorial Lecture 2025



ప్రొఫెసర్ జయశంకర్ అనంతర తెలంగాణ

అల్లం నారాయణ

మాజీ చైర్మన్, తెలంగాణ మీడియా అకాడమీ

సంపాదకులు మరియు కవి

Organised by

Dr.B.R. Ambedkar Open University,

Prof.G.Ram Reddy Marg, Road No. 46,

Jubilee Hills, Hyderabad (TS) 500 033

About Dr. BRAOU

The University, initially known as Andhra Pradesh Open University, was set up on 26th August 1982 through an Act of the A.P.State Legislature (APOU Act 1982). Subsequently the University was renamed as Dr.B.R.Ambedkar Open University on 26th October,1991. The establishment of this University, the first of its kind in India, heralded and era of affirmative action on the part of the Government to provide opportunities of higher education to all sections of society to meet the changing individual and social needs. The University is providing services to the student community through a wide network of 104 study centres spread across the Telangana state including 10 Regional Co-ordination centres and 6 centres exclusively meant for women students. Prison inmates under life sentence also enrol themselves as students and pursue education through exclusive study centres at Central Prison - Cherlapally, Warangal an exclusive Study Centre for Army Personal and their family members, which was located at AOC, Secunderabad. The University offers UG, PG Degree, Certificates, Diploma and Ph.D. programmes including various Professional Programmes.

ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్మారకోపన్యాసం 2025

ప్రొఫెసర్ జయశంకర్ అనంతర తెలంగాణ

అల్లం నారాయణ

మాజీ చైర్మన్, తెలంగాణ మీడియా అకాడమీ

సంపాదకులు మరియు కవి

Dr. B.R. Ambedkar Open University

Prof. G.Ram Reddy Marg, Road No. 46,

Jubilee Hills, Hyderabad (TS) 500 033

ఆచార్య జయశంకర్ అనంతర తెలంగాణ

అల్లం నారాయణ

'IF THE EDUCATED CLASSES ARE SILENT ON SOCIAL ISSUES AND INDIFFERENT TO THE PEOPLES PROBLEMS THEN THE SITUATIONS WILL BE WORSE THAN THE TERRORISM'

- PROF. JAYASHANKAR

'సామాజిక సమస్యల పట్ల విద్యావంతులు మౌనం వహిస్తే ప్రజా సమస్యలను పట్టించుకోకపోతే పరిస్థితులు ఉగ్రవాదం కన్నా హీనంగా తయారువుతాయి'

– ప్రొఫెసర్ జయశంకర్

జీవిత కాలమంతా తెలంగాణ కోసం కలవరించి, పలవరించిన జయశంకర్ విద్యావంతుల సామాజిక బాధ్యతల మీద విస్పష్టంగా చెప్పిన అభిప్రాయమిది. జయశంకర్ ఆదర్శనీయుడు. సామాజిక ఆదర్శాలను నమ్మి ఆచరించిన వ్యక్తి. 1952 ముల్కీ ఉద్యమం నుంచి చివరిదాకా ఆయన తెలంగాణ ఉద్యమం వెంట నడిచారు. ఈ ఉద్యమానికి భావజాల సంపదను చేకూర్చారు. సిద్ధాంతాన్ని ఇచ్చారు. తెలంగాణ తొలి, మలి పోరాటాల మధ్య కూడా స్థల కాలాదుల్లో ఆయన తెలంగాణ ఉద్యమం గురించి మాత్రమే ఆలోచించారు. తెలంగాణ ఉద్యమం ఎందుకు? వచ్చింది? ఎట్లా ఈ ఉద్యమం నడుస్తుంది? ఎట్లా ఉద్యమం ఒడ్డుకు చేరుతుంది? అనే అంశాలను తీర్చిదిద్దినట్టుగా జయశంకర్ భావజాల వ్యాప్తి చేశారు. వలసల స్వభావం, అంతర్గత వలసల దోపిడి స్వభావం, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వివక్ష ఏర్పరిచే ఆధిపత్య భావజాలం

రూపుదిద్దుకునే క్రమాన్ని, భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడినప్పటికీ ఆ ఏర్పాటులోనే ఉన్న వైరుధ్యాలు, బలవంతంగా రుద్దిన ఐక్యత వల్ల అది అనివార్యంగా విచ్ఛిన్నమవుతుందని జయశంకర్ చెప్పారు. అమూర్తంగా ఉన్న తెలంగాణ భావనకు, అస్తిత్వ ప్రాంతీయ నినాదానికి ఒక బలమైన అభివృద్ధి ఆకాంక్షను జతచేసి ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ బలవంతంగా రుద్దిన తర్వాత కూడా, కేవలం హైదరాబాద్ మీద దురాశ, ఆధిపత్య భావనలతో ఆంధ్ర దళారీవర్గం తెలంగాణను చిన్నచూపు చూసింది. ఈ అపవిత్ర బంధం పునాదులలోనే అపోహలు, అనుమానాలు, అధిపత్య ధోరణులు, ఒడంబడికలు, షరతులు, అపనమ్మకాలు, ఒక జాతి భావనగా ఏర్పడక పోవడానికి ప్రధాన కారణాలు. అంతర్గత వలస స్వభావంతో ఆంధ్ర రాజకీయ దళారీ వర్గం పెత్తనం మాత్రమే కొనసాగే ఈ ఏర్పాటు విచ్ఛిన్నం అవుతుంది. తప్పదు. ఒప్పందాలు, షరతులు, అపనమ్మకాలు, ఉన్నప్పుడు విభజన మంచిది. కలిపిన తర్వాత ఎట్లాగూ జాతి భావన లేదు. కాని విడిపోయి కలిసి ఉండటం ద్వారా తెలుగు భాషకు, సంస్కృతికి వచ్చే నష్టం లేదు అని జయశంకర్ భావన. అందువల్లనే వేమన పద్యాలు, సుమతీ శతకాలు, శ్రీశ్రీ మహాప్రస్థానం, బ్రహ్మంగారి కాలజ్ఞానం, నన్నయ, తిక్కన, సోమనలు ఎటూ పోరు. తెలుగు భాషలో వారి సాహిత్యం కూడా సుసంపన్నంగానే ఉంటుందని చెప్పారు.

1) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్వభావం

2) కోస్తాంధ్ర వలస పెత్తందారు

3) వాళ్ల కొమ్ము కాసే దళారులు

4) కోస్తాంధ్ర ప్రయోజనాల కొమ్ముకాసే మీడియా

ఈ నాలుగు ఆంశాలు ఆంధ్రప్రదేశ్ ఆధిపత్య స్వభావానికి మూల స్తంభాలని జయశంకర్ భావన. అంతర్గత వలస ఫలితంగా తెలంగాణ

ప్రాంతంలో వనరుల అసమాన పంపిణీ, రాజకీయ అధికార భాగస్వామ్యం లేకపోవడం అనేది హక్కులను హరిస్తున్నది. అందువల్లనే తెలంగాణ అస్తిత్వ భావనకు ప్రాంతీయ అభివృద్ధి భావనగా జయశంకర్ చెప్పారు. ప్రభుత్వాలను పెట్టుబడులకు సంబంధించిన ప్రామాణిక సూత్రాలు, విలువలు, అనుభవాలు నడిపిస్తాయి. అందువల్ల అంతర్గత వలసగా మారిన తెలంగాణలో అధికార రాజకీయాలన్నీ, ధనరాసుల పెట్టుబడి వ్యూహాలపైనే నడుస్తాయి. ఆ ఆధినాయకత్వాల ఆధిపత్యం కింద తెలంగాణ భృత్య నాయక వర్గాలు తయారవుతాయి. అందువల్లనే స్వీయ నిర్ణయాధికారం, మన వనరులపైన మనకే అధికారం. ఇందుకు పనిచేసే స్వీయ రాజకీయ అస్తిత్వం ఏర్పడాలని జయశంకర్ భావన.

వనరుల పంపిణీలో ప్రాంతీయ అసమానతలకు మూల కారణంగా ఉన్న ఆంధ్ర పెట్టుబడిదారీ, దళారీ రాజకీయ నాయకత్వం వల్ల క్షేత్రస్థాయిలో అసంఘటితంగా ఉన్న తెలంగాణవాదాన్ని సంఘటితపరిచి బలమైన పునాదులు వెయ్యాలన్నది జయశంకర్ అభిప్రాయం. విశిష్ట సంస్కృతి, చరిత్ర, వారసత్వం ఉన్న ఈ ప్రాంతం మీద ఆంధ్రుల పెత్తనం రాజకీయ, ఆర్థిక అంశాల్లోనే కాకుండా సాంస్కృతిక పెత్తనానికి దారితీసింది. అందుకే జయశంకర్ కాళోజీని ఉటంకిస్తూ 'రాజకీయాలలో ఓటమి ఎదురైతే, మరోసారి మళ్లీ సాధించుకోవచ్చు. కానీ, సంస్కృతి పరాయిదైతే మళ్లీ ఏర్పరచుకోలేం' అన్న విషయాలు చెప్పారు. అందుకే ప్రాంతీయ అసమానతలు, రాజకీయ ఉద్యమం, స్వీయ అధికారం గురించి ఎంత మాట్లాడేవారో? భాషా వివక్ష సంగతులు కూడా జయశంకర్ విస్తృతంగా చర్చించేవారు. తెలంగాణ భాషలో ఉర్దూ పదాలు ఎక్కువ మిళితమైన భాష అని, 'తౌరాక్యాంధ్యము' అని మాట్లాడిన వారికి, తెలంగాణ ఏర్పడితే 'దక్షిణ పాకిస్తాన్' అవుతుందన్న జంధ్యాల పాపయ్య శాస్త్రి లాంటి వాళ్ల వాదనలను తిప్పికొట్టారు జయశంకర్. ఆంధ్రుల భాషలోనే ఎక్కువ ఉర్దూ

కలిసి ఉన్న విషయాన్ని "బేజార్, పంకా, జెండా' లాంటి పదాల వాడకం కోస్తా ఆంధ్ర తెలుగులోనే ఉన్నాయని సోదాహరణంగా వివరించారు. మీ భాషలో అడుగడుగునా ఉర్దూ వాడతామన్న విషయం మీకు తెలియదు అని విస్పష్టంగా చెప్పారు. భాషా వివక్ష, సంస్కృతీ వివక్ష కూడా మన పోరాటంలో భాగంగా ఉండాలన్నది జయశంకర్ అభిప్రాయం. అందుకే మలి తెలంగాణ ఉద్యమంలో రాజకీయ ఉద్యమంతో పాటు సాంస్కృతిక ఉద్యమం కూడా పతాకస్థాయికి చేరి ఉద్యమాన్ని సజీవంగా కాపాడింది. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఉద్యమంగా తెలంగాణ ఉద్యమం సాగింది.

తెలంగాణ ప్రాంతీయ అసమానతల మూలాలను ఎత్తి చూపిన జయశంకర్, ప్రజలను ఏమార్చే ఆధిపత్య దోపిడీవర్గాల పట్ల జాగరూకతతో ఉండాలని, సామాన్య ప్రజల పట్ల విశేషం ఉండరాదని చెప్పారు. 1969 ఉద్యమం గుణపాఠంగా జాగో బాగోలు అవసరం లేదని హైదరాబాద్ ఉపాధి కేంద్రంగా ఉన్నందున పొట్టపోసుకోవడానికి వచ్చే వారి పట్ల ఆదరణ ఉండాలన్నారు. హైదరాబాద్ మనది. ఇక్కడ అధికారం మనది కావాలి. పరిపాలన మనదే కావాలి. బతకడానికి వచ్చినవాళ్లు సెక్రటేరియట్‌లో చక్రం తిప్పడం కుదరదని జయశంకర్ స్పష్టంగా చెప్పారు.

తెలంగాణ ఉద్యమానికి ఆయన మూడు మార్గాలు సూచించారు. 1. రాజ్యాంగ అధికరణం–3 ప్రకారంగా పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడానికి రాజకీయ ప్రక్రియ. 2. రాజకీయ ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు ప్రజా ఉద్యమం. 3. ఈ కార్య సాధనకు తెలంగాణ ప్రజలను మేల్కొల్పే భావజాల వ్యాప్తి, మేధోకృషి. ఈ మార్గాల ద్వారా తెలంగాణను సాధించుకోవాలని చెప్పారు.

అయితే తెలంగాణ వాస్తవ స్థితిగతుల మీద ఆధారపడి ఒక భావజాలాన్ని తయారుచేసుకోవాలని, ఇది ఎంత న్యాయబద్ధమైనదో? ప్రాంతీయ

అభివృద్ధితో ఇది ఎట్లా దోహదపడుతుందో? సోదాహరణంగా చెప్పాలన్నారు ఆయన. 'తెలంగాణ మూవ్‌మెంట్, యాన్ ఇన్వెస్టిగేషన్ ఫోకస్', 'తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్', పుస్తకాల ద్వారా జయశంకర్ ఈ వాదనలను వినిపించారు.

సీమాంధ్ర పెట్టుబడిదారుల గుత్తాధిపత్యంలో ఉన్న ప్రసార సాధనాలన్నీ కూడా వాస్తవాలను మభ్యపెట్టడం, మరుగునపడేయడం, వక్రీకరించడం ద్వారా తెలంగాణ డిమాండ్‌తో ఆంధ్ర ప్రాంతం నష్టపోతుందన్న అపోహలను సృష్టించారు. గోదావరి, కృష్ణ నదీ జలాలు ఒక్క చుక్క కూడా తెలంగాణ కిందకు వదలదని ఒక పచ్చి అబద్ధాన్ని ప్రచారం చేశారు. హైదరాబాద్ ఒక రాజధానిగా ప్రజల కోసం కానీ పెట్టుబడుల కోసం కాదు అని ప్రచారం చేయడం ద్వారా తెలంగాణ ఏర్పడితే గోదావరి మొత్తాన్ని ఆపడం ఎవరి తరం కాదని చెప్పడం ద్వారా సామాన్య ఆంధ్రులలో సానుకూల అభిప్రాయం కలగజేయాలని జయశంకర్ అన్నారు. అపనమ్మకాల ద్వారా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ఒక జాతి భావన ఏర్పరచడంలో విఫలమైనప్పుడు తెలంగాణ ఏర్పడటం ఆంధ్రాకు కూడా లాభమే అని విషయాలు చెప్పగలగాలి. ఆంధ్రకు విశాలమైన తీర ప్రాంతం, ఖనిజ సంపద, రవాణా వ్యవస్థలు వనరులు ఉన్నాయి. అవి ఆంధ్రప్రదేశ్ ను కూడా సుసంపన్నమైన రాష్ట్రంగా అభివృద్ధి చేస్తాయి అన్న సానుకూల అంశాలతో సామరస్యంగా ఉద్యమం ద్వారా ఆంధ్రుల మనసులు గెలుచుకోవాలని ఆయన చెప్పారు.

భావజాలవ్యాప్తి ప్రధానంగా ఒక ఆచరణగా, కార్యచరణగా ఆయన 1952 నుంచి 2011 లో పరమపదించేదాకా పనిచేశారు. కానీ, తెలంగాణ సాధించక ముందే ఆయన కన్నుమూశారు.

అసలు విషయానికి వస్తే జయశంకర్ అనంతరం తెలంగాణ నా ప్రసంగ పాఠం. ముఖ్యాంశం తెలంగాణ ఏర్పడితే ప్రాంతీయ అభివృద్ధి జరుగుతుందని స్వీయ అస్తిత్వంలో, స్వీయ రాజకీయ అస్తిత్వంలో ప్రాంతీయ

అసమానతలను మూల ధాతువులైన నీళ్ళు, నిధులు, నియామకాలు అమలవుతాయని తెలంగాణ వనరులపైన తెలంగాణ పెత్తనం ఉంటుందని ఆంధ్ర ఆధిపత్య వలసలో భృత్యు వర్గాలుగా పనిచేసిన తెలంగాణ నాయకత్వం తెలంగాణ ప్రాంత ప్రయోజనాలో పరమావధిగా పనిచేస్తారని జయశంకర్ భావించారు.

"తెలంగాణ సాధనకు భావజాలం ఎంత అవసరమో తెలంగాణ అభివృద్ధికి కూడా భావజాలం అంతే అవసరం" అని జయశంకర్ అభిప్రాయం. ప్రాంతీయ అసమానతల వల్ల ఆర్థికాభివృద్ధి కుంటుపడి, కొందరికే ఫలాలు దక్కడం అసంఘటిత రంగ సమస్యలు పరిష్కరించే దిశగా ఆలోచించాల్సి ఉంటుందన్నది ఆయన అభిప్రాయం. తెలంగాణ వాదం ఒక బలమైన ప్రాంతీయ అభివృద్ధి ఆకాంక్ష. మన వనరులను తరలిస్తున్న పద్ధతుల వల్ల నష్టపోతున్న ఒక ప్రాంతం తన వనరులు తనకే దక్కాలని చేస్తున్న పోరాటమే తెలంగాణ పోరాట సారాంశం.

తెలంగాణ సాధనలో భౌగోళిక తెలంగాణ తొలి పాదం మాత్రమే. తెలంగాణ వంటి అంతర్గత వలసలు అసమ అభివృద్ధి నుంచి బహిరంగంగా అసమానతల నుంచి అంతర్గతంగా, అంతర్ బహిర్ పీడనల నుంచి సమగ్రంగా విముక్తి సాధించాలన్నది స్థూలంగా జయశంకర్ అభివృద్ధి భావన.

తెలంగాణ సిద్ధించి పదకొండు సంవత్సరాల అనంతరం తెలంగాణలో ఏం జరుగుతున్నది? ఏం జరగాల్సి ఉండింది అనేది పరిశీలించాల్సి ఉన్నది.

సాధించుకున్న తెలంగాణలో నీళ్ళు, ఉపాధి, విద్య, వైద్యం, సాంస్కృతిక వైభవం ముఖ్యమైనవని జయశంకర్ భావన. ఇతరుల పాలనలో యాచిస్తాం, స్వయం పాలనలో శాసిస్తాం అన్నది ఆయన నమ్మకం. ప్రాంతీయ అభివృద్ధికి దీర్ఘకాలిక ఆర్థిక, రాజకీయ, సాంఘిక పునర్నిర్మాణం జరగాలని ఆకాంక్ష.

తెలంగాణ ఉద్యమ సందర్భంలోనే రెండుపాయల అభిప్రాయాలు ఏర్పడి ఉన్నాయి. ఒకటి ప్రజాస్వామ్య తెలంగాణ, రెండవది సామాజిక తెలంగాణ. కానీ, తెలంగాణ ఒక సుదీర్ఘ ఉద్యమంగా సాగుతున్నక్రమంలో మొత్తం తెలంగాణ ఒక ఏకాత్మగా ఐక్యమైన పరిస్థితుల్లో, రాజకీయ పరిస్థితులు పరిపక్వమైందని ఇదే ఆఖరి మోఖ, ఔర్ ఏక్ ధక్కా అన్న అభిప్రాయంతో తెలంగాణ సాధన అనంతరం మన అంతర్గత నిర్మాణాల్లో ప్రజాస్వామ్యం, సామాజికన్యాయం సాధించుకుందాం అని తెలంగాణ ఉద్యమం భావించింది. అందుకే ముందు భౌగోళిక తెలంగాణ ఆ తర్వాత మిగతా మన లక్ష్యాలు అన్నది సర్వత్రా ఒక అభిప్రాయం. అందుకే భావజాల పరంగా, కార్యాచరణల పరంగా చైతన్య స్థాయిలలో వేర్వేరుగా ఉన్న శక్తులను ఒకే తాటిపైకి ఒకే ఒక్క తెలంగాణ సాధన ప్రక్రియలోకి తెచ్చేందుకు జయశంకర్ లాంటి వాళ్ళు ఏ అభిప్రాయాలు కలవాళ్లయినా ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ దాకా ఈ ఉద్యమంలో కలిసి సాగాలని సూచించారు. వీలైతే సమన్వయం లేదా సమాంతర ఉద్యమాల ద్వారా తెలంగాణ సాధించుకోవాలని పిలుపు ఇచ్చారు. కానీ తెలంగాణ అనంతరం జరిగిన పరిణామాలు ఉద్యమ సందర్భంలో చెప్పిన మాటలకు అనుగుణంగా ఉన్నాయా? అంటే లేవని చెప్పాలి.

తెలంగాణ ఏర్పడిన వెంటనే జరిగిన పరిణామాలు: పదేళ్లు ఒకే పార్టీ అధికారంలో ఉండడం, ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీగా పేరు మార్చుకున్న టీఆర్ఎస్ పార్టీ ఓడిపోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని ఇప్పుడు అర్థం చేసుకోవాల్సి ఉన్నది. మలి తెలంగాణ ఉద్యమం నాటికీ ప్రజాస్వామ్య తెలంగాణ డిమాండ్ రావడానికి ప్రధానంగా ఒక కారణం ఉన్నది. తొలి ప్రాంతీయ అస్తిత్వం ఉద్యమ వైఫల్యాల వల్ల ప్రత్యేక తెలంగాణ పోరాటాల విఫలమైన తర్వాత పరిణామాల్లో తెలంగాణ నక్సల్ బరీ రాజకీయాలకు వేదికయింది. తొలి తెలంగాణ ఉద్యమ ద్రోహానికి గురైందని భావించిన

చైతన్యవంతమైన అప్పటి తరం నక్సల్‌బరీ ఉద్యమంలో దూకింది. ఆ ఉద్యమం తెలంగాణ అంతటా ఒక బలమైన ఉద్యమంగా మారినాక తీవ్ర నిర్బంధం, అణచివేత, ఆటమాట బంద్ దాకా పరిస్థితులు విషమించాయి. ఎప్పుడూ ఎవరు ఎన్‌కౌంటర్ అవుతారో తెలియదు. పల్లెలు కల్లోల ప్రాంతాలు అయినాయి. చంద్రబాబు హయాంలో తీవ్ర నిర్బంధం అమలైంది. ఒకవైపు సీమాంధ్ర పెత్తందారి రాజకీయ నాయకుల విధానాల వల్ల శిథిలమైన తెలంగాణ, మరోవైపు కనీసం మాట్లాడే స్వేచ్ఛ నిర్బంధం. సరిగ్గా ఈ సమయంలో మలి తెలంగాణ ఉద్యమం రూపుదిద్దుకున్నది. తొలినాళ్ల తెలంగాణ ఉద్యమానికి భావజాలవ్యాప్తితో వామపక్ష ఉద్యమకారులు ముందుభాగాన నిలిచారు. ఆ తర్వాత ఉద్యమంలో కీలకంగా ఇవే సెక్షన్ల నాయకులు మమేకం అయ్యారు. అందువల్ల తెలంగాణ ఉద్యమం అంతా ప్రపంచీకరణ విధానాలు, అభివృద్ధి నమూనాలు, సరళీకరణ, ప్రైవేటీకరణ, ఉదారీకరణలకు వ్యతిరేకంగా జరిగే పోరాటమని అన్ని ప్రజాస్వామ్య స్వేచ్ఛలు వర్ధిల్లాలని డిమాండ్ ముందుకు వచ్చింది. ప్రజాసంఘాలలో మెజారిటీ ఐక్య వేదికలు కట్టి, సంఘటనలల్లో సమీకరించి ప్రజాస్వామ్య తెలంగాణ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ మార్గం గురించి కూడా ఈ శక్తులకు భిన్న ఆలోచనలు ఉండేవి. లాబీయింగ్ ద్వారా తెలంగాణ సాధ్యం కాదని, ఒక చిన్న ప్రాంతం రాజకీయ ఏకాభిప్రాయం సాధించి, పార్లమెంటులో బిల్లు పెట్టి తెలంగాణ సాధించడం కష్టమని, తద్భిన్నంగా సమరశీల పోరాటాల ద్వారా తెలంగాణ సాధన అనే అభిప్రాయం బలంగా ఉండేది. భౌగోళిక తెలంగాణ మాత్రమే వస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని, అస్తిత్వ పోరాటమే అయినప్పటికీ తెలంగాణ పోరాటం ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటంగా భావించి తెలంగాణలో కనీసంగా లేని అన్నిస్వేచ్ఛలు, హక్కుల కోసం ప్రజాస్వామ్య తెలంగాణ ఈ డిమాండ్ వచ్చింది.

మరోవైపు తెలంగాణ సామాజిక ఛట్రం, కులమతాల ప్రాతినిధ్యం భిన్నమైనది. అగ్రవర్ణాలుగా చెప్పుకునే వారి సంఖ్య 10 శాతంగా ఉంటే ఎస్సీ, ఎస్టీ బీసీలతో కూడిన బహుజనుల జనాభా అట్లాగే మైనారీటీలనూ కలుపుకుంటే దరిదాపు 90 శాతం జనాభా బడుగు బలహీన వర్గాలదే. రిజర్వేషన్లు "మా జనాభా ఎంత ఉంటే మాకు అంత" అనే భావం. దామాషా పద్ధతిలో సామాజిక న్యాయం కావాలని బహుజన వర్గాల ఆక్షాంక్ష. అందుకే సామాజిక తెలంగాణ నినాదం ముందుకు వచ్చింది. భౌగోళిక తెలంగాణ సాధించుకున్న తర్వాత మన తెలంగాణలో మనం ప్రజాస్వామిక, సామాజిక న్యాయ తెలంగాణను నిర్మించుకుందామని అప్పటి ఉద్యమం, ఆ ఉద్యమానికి నాయకత్వం వహించిన రాజకీయపార్టీ భావించింది. జయశంకర్ అదే అభిప్రాయంలో ఉండేవారు.

విడిగా ప్రజాసంఘాలు, వేదికలు పౌరసమాజం ఎంత పోరాడినప్పటికీ అంతిమ ఫలితం రాదు అన్నది జయశంకర్ భావన. ప్రత్యేక తెలంగాణ సాధన ఆర్టికల్ -3 రాజకీయ ప్రక్రియ, పార్లమెంటులో బిల్లులో ముడివడి ఉన్నందున ఒక రాజకీయపార్టీ సారధ్యం లేకుండా తెలంగాణ కల సాకారం కాదు అని జయశంకర్ భావించారు. అన్ని పాయలను కలుపుకొని తెలంగాణ ఉద్యమానికి సారధ్యం వహించేది టీఆర్ఎస్ అని తప్పులో, ఒప్పులో, లోపాలో ఎన్ని ఉన్నాయని ఎవరు అనుకున్నా కేసీఆర్‌కు ఈ విశాల ఉద్యమానికి నాయకత్వం వహించే సత్తా ఉందని జయశంకర్ బహిరంగంగానే ప్రకటించారు. టీఆర్ఎస్ ఒక ఉద్యమపార్టీగా అవతరించింది. జయశంకర్ జీవించి ఉన్నంతకాలం అది ఉద్యమపార్టీయే. తెలంగాణ వచ్చింది. జయశంకర్ లేరు. తెలంగాణ వచ్చిననాడే, పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందినరోజు టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తమ రాజకీయ అస్తిత్వం గురించి కీలక ప్రకటన చేశారు. ఉద్యమపార్టీ ఇకనుంచి 'ఫక్తు' రాజకీయపార్టీ అవుతుందని విస్పష్టంగా

ప్రకటించారు. ఆ తర్వాత అధికారంలో కొనసాగిన పదేళ్ళు ఫక్తు రాజకీయపార్టీగానే నడిపారు. బహుశా ఇది జయశంకర్ ఊహించి ఉండరు. ఆయన ఉంటే దీన్ని సమర్థించేవారో కాదో తెలియదు. కానీ ఫక్తు రాజకీయపార్టీగా అవతరించిన టీఆర్ఎస్ పార్టీ పదేళ్ళ కాలం సగటు రాజకీయపార్టీ లక్షణాలతోనే నడిచింది. రాజకీయ అధికారమే అంతిమ లక్ష్యంగా రాజకీయ అధికార సాధనకు ఓటుబ్యాంకు తయారీ రాజకీయలనే అనుసరించింది. ఏర్పడిన ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి మొదటిసారి గెలిచినప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహించింది. సాధించుకున్న తెలంగాణకు వ్యతిరేకంగా కుట్రలు జరుగుతున్నాయని చంద్రబాబు, కోస్తాంధ్ర పెట్టుబడిదారీ రాజకీయ నాయకులు తెలంగాణ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలు చేస్తున్నారని అందువల్ల మెజారిటీ పెంచుకోవడానికి ఫిరాయింపులని టీఆర్ఎస్ ప్రకటించింది. అది నిజమని నమ్మే విధంగా పరిణామాలు జరిగాయి. ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పుడు తెలుగుదేశంలో ఉన్నారు. ఆ మాటకొస్తే ఉద్యమ సందర్భంలోనూ రెండుకళ్ళ సిద్ధాంతకర్త చంద్రబాబుతో ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలో బహిరంగంగా ఓటుకు నోటు కేసు బయటపడింది. ఆ రకంగా కుట్ర సిద్ధాంతాన్ని ఎవరూ వ్యతిరేకించలేదు.

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడకముందు తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత అప్పటి ఉద్యమకారులతో, ప్రజాస్వామ్యవాదులతో ఘంటా చక్రపాణి ఇంట్లో నాలుగురోజుల పాటు చర్చలు జరిపారు. భవిష్యత్ తెలంగాణ ఎట్లా ఉండాలో సవివరాత్మకంగా మేధోమథనం చేశారు. విద్య, వైద్యం, నీటిపారుదల, నియామకాలు, నిధులు, ప్రజాస్వామ్య స్వేచ్ఛలు ఇట్లా తెలంగాణ ఏర్పడినాక జయశంకర్ చెప్పినట్టుగానే పునర్నిర్మాణానికి ఒక భావజాలాన్ని తయారుచేయడానికి ఈ సమావేశాలు జరిగాయి. ముఖ్యంగా ప్రజాస్వామ్య స్వేచ్ఛలన్నీ వర్ధిల్లాలన్నా విషయాలపై తీవ్ర మథనం జరిగింది.

తెలంగాణ పునర్నిర్మాణ భావజాల నిర్మాణానికి, కార్యాచరణకు పాతిక మందితో ఒక 'కమిటీ' ని అధికారికంగా నిర్మిస్తామని కేసీఆర్ ప్రకటించారు. కానీ ఆచరణలో ఇవేవీ అమలుకాలేదు.

సామాజిక న్యాయం డిమాండ్‌లు వచ్చిన ప్రతిసారీ, సామాజిక తెలంగాణ నినాదం బలంగా వినిపించిన ప్రతిసారీ కేసీఆర్ 'దళితుణ్ణి ముఖ్యమంత్రి' చేసి తెలంగాణకు నేను కాపలా ఉంటానని ప్రకటించారు. కానీ, సమర్థ నాయకత్వం పేరిట, ఎన్నికల సమయంలో దళితుడే ముఖ్యమంత్రి అనే హామీ లేకుండా గెలిచినందువల్ల ఆ డిమాండ్ ఊసులో లేకుండాపోయింది.

అభివృద్ధి నమూనా తీసుకుంటే అవే విధానాలు కొనసాగాయి. స్వయం పాలన, స్వీయ రాజకీయ నాయకత్వం, జయశంకర్ చెప్పినట్టు ప్రాంతీయ అసమానతలు తుడిచివేసే ప్రత్యేక అభివృద్ధి నమూనాను కాని, బహిర్–అంతర పీడనల నుంచి సమగ్రంగా విముక్తి సాధించే అభివృద్ధి నమూనాను ప్రత్యేకంగా రూపొందించలేదు. నీటి పారుదల సౌకర్యాల విషయానికి వస్తే కాళేశ్వరం ప్రధానంగా చెప్పుకోవాలి. నిజమే తెలంగాణ వస్తే ఎత్తు ప్రాంతం కనుక నీటి పారుదలా ఉండదని సాధ్యంకాదని ఆంధ్ర నాయకత్వం ఎద్దేవా చేసింది. అట్లాగే తెలంగాణ వెనుకబడడానికి కారణం కృష్ణా, గోదావరి నదీజలాలను మళ్లీంచుకోవడం. స్తన్యం దక్కని శిశువులా మారిన తెలంగాణకు అంతకు ముందు ఆంధ్ర పాలనలో నిర్లక్ష్యానికి గురై, ఏళ్ళూ, పూళ్ళూ గడిచినా పూర్తికాని ప్రాజెక్టులకు, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసుకోవడం కృష్ణా జలాల్లో మన వాటా వాడుకోగలిగిన కొత్త ప్రాజెక్టుల రూపకల్పన, గోదావరి జలాలను పూర్తిగా వాడుకొనడంగా అవగాహన ఉండాల్సింది. కానీ జలయజ్ఞం కొనసాగింపులాగా కాళేశ్వరానికి అన్నింటికి మించిన ప్రాధాన్యత కల్పించారు. అదొక భారీ ప్రాజెక్టుగా రూపుదిద్దుకున్నది. తుమ్మిడిహట్టి నుంచి ఎక్కువ మేర గ్రావిటీ ద్వారా ప్రాజెక్టు ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పోల్చి చూసినప్పుడు సులభమైన ప్రాజెక్టు.

మహారాష్ట్ర అభ్యంతరాల మధ్య అది సాధ్యం కాదని నిజంగానే ఒక భారీ ఖర్చుతో అతి పెద్ద నీటిపారుదల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం తయరయింది. వ్యయాలు భారీగా అవసరం అయ్యాయి.

అసంపూర్ణంగా ఉన్న ప్రాజెక్టుల మీద కంటే కాళేశ్వరం ఒక్కటే సర్వరోగ నివారిణి అయింది. చివరికి ఆంధ్ర నాయకత్వాల సమయాల్లో ఏ ఆంధ్రా కాంట్రాక్టర్లు రాజ్యమేలినారో? అదే కాంట్రాక్టర్ల ధనదాహానికి దురాశకు కాళేశ్వరం చివరికి అలా మిగిలింది. సారాంశంలో ఈ ప్రాజెక్టు తెలంగాణకు జీవనాడి వంటిది. నిజమే ఒక ప్రాంతం అభివృద్ధికి నీటి నడకే ప్రధానమయింది. మిగతా విషయాలు, విమర్శలు ఎట్లున్నా కాళేశ్వరం రూపకల్పన ఆంధ్ర కాంట్రాక్టర్లు హెచ్చువేసిన అయినాలలో ఆ తర్వాత మేడిగడ్డ కుంటుపడడంతో కాళేశ్వరం ఒక ప్రశ్నగా మిగిలింది. ఒక అద్భుతం చివరికి అవమానంగా తయారయింది. కాళేశ్వరం విమర్శకులవి కూడా వితండ వాదనలే. నిజమే ప్రాణహిత చేవేళ్ళ మహారాష్ట్ర కోరుకున్న ఎత్తులో నిర్మిస్తే నీటి లభ్యత తక్కువే. అందువల్లనే మేడిగడ్డ, ఎత్తిపోతలు ఉత్తరం నుంచి దక్షిణ తెలంగాణ దాకా నీటి పారుదల పకడ్బందీ వ్యవస్థగా కాళేశ్వరం ఉన్నది నిజమే. కానీ బడా ప్రాజెక్టులు సామాన్య ప్రజల అనుకూలమైనవి కావు. ప్రాంతీయ అంతర్గత అసమానతలను పెంచుతాయే తప్ప సమం చేయవు. పైగా నిర్వాసితుల సమస్య. ఈ కోణంలో నుంచి చూసి కాళేశ్వరం అయినా కట్టాల్సి ఉన్నది.

తెలంగాణ పదేళ్లు బంగారు తెలంగాణ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ మొట్టమొదటి ప్రభుత్వం ఏర్పడినప్పుడు ప్రధానంగా నీటిపారుదల వ్యవస్థల్లో తెలంగాణకు ప్రత్యేకమైన గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణకు మిషన్ కాకతీయ జరిగింది. మంచినీటి వసతి కల్పించడానికి మిషన్ భగీరథ కూడా 40000 కోట్ల పైబడిన వ్యయంతో నిర్మించారు. కానీ ఒకసారి కాళేశ్వరం ప్రారంభం అయ్యాక అన్ని ప్రాధాన్యతలు

మారిపోయాయి.

విద్యుత్ రంగం టీఆర్ఎస్ ప్రభుత్వంలో మెరుగుపడింది. రెప్పపాటు కరెంటు పోకుండా నిర్వహణ ఇప్పటికీ ప్రశంసలు అందుకుంటోంది. ఉత్పత్తిలో స్వావలంబన సాధ్యమైంది. తెలంగాణ వస్తే చీకటి రాజ్యం అవుతుందని నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి లాంటి వాళ్లు చేసిన ఆరోపణలకు తెలంగాణ ప్రభుత్వం బుద్ధి చెప్పింది.

తెలంగాణ అభివృద్ధికి సంబంధించి మూడు నాలుగు అంశాలను ఆర్థిక నమూనాలుగా ప్రభుత్వం చూపింది. టీఆర్ఎస్ పాలనలో జీడీపీ కనీ వినీ ఎరగని విధంగా ఐదు లక్షల కోట్ల నుంచి 15 లక్షల కోట్లకు ఎదిగింది. అభివృద్ధి సూచీలలో ఇది నమోదైన రుజువు. వరి ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ గా నిలిచింది. వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వడం, ఆత్మహత్యలతో కునారిల్లుతున్న రైతాంగాన్ని నిలబెట్టడానికి 'రైతుబంధు' లాంటి పథకాలు ప్రకటించడం, యూరియా లాంటి వ్యవసాయ ఆధారిత ఎరువులు, మందులు అందుబాటులోకి తేవడం, చెరువులు నింపడం ద్వారా నీటిపారుదల వ్యవస్థలను స్థిరీకరించి మెరుగుపరచడం వల్ల ఇది సాధ్యమైంది. నిజంగానే ఇది ఒక అద్భుతమే. అన్నపూర్ణగా పిలిచే ఆంధ్రప్రదేశ్‌ను, పంజాబ్ లాంటి రాష్ట్రాలను వెనక్కి నెట్టి వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్ కావడం అద్భుతమే.

అట్లాగే తలసరి ఆదాయంలో పైకి ఎగబాకడం. మరోవైపు మొత్తం తెలంగాణ అంతటా అనుసంధానంగా రోడ్లు నిర్మించి పూర్తి రవాణా కనెక్టివిటీని సాధించడం ఇవి ప్రధానంగా చెబుతారు. కానీ ఇవేవీ ప్రాంతీయ ప్రాతినిధ్య అభివృద్ధి నమూనాలు కావు. పైగా స్వీయ రాజకీయ నాయకత్వంలో కూడా ఆంధ్ర కాంట్రాక్టర్లు పెట్టుబడిదారుల ఆధిపత్యమే నడిచింది మార్పేమి జరగలేదు.

మరోవైపు సామాజిక తెలంగాణ లక్ష్యాలు నెరవేరలేదు. బీసీల కోసం రూపొందించిన ప్రత్యేక పథకాలకు ప్రకటించిన నిధుల్లో పట్టుమని 10 శాతాలు అమలు కాలేదు. కేజీ నుంచి పీజీ దాకా ఒకే ఆవరణలో విద్య అని ప్రకటించి చివరకు రెసిడెన్షియల్ పాఠశాలలతో సరిపెట్టారు. వైద్యం సరాసరి. ఉచిత విద్య ఉచిత వైద్యం సంగతి ఏమోగానీ కార్పొరేట్ ఆసుపత్రులు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. చైతన్య, నారాయణ కళాశాలలు మరింత గుత్తాధిపత్యంతో మరింత బలపడ్డాయి. మరోవైపు విద్య వైద్యం బడ్జెట్లో లెక్కలు తీస్తే అసలు రంగు బయటపడుతుంది. సాధారణంగా తెలంగాణ భిన్నంగా ప్రాంతీయ లక్షణాలతో ప్రత్యేక అభివృద్ధి నమూనా ఏమీ లేదు. ఫలితంగా తెలంగాణ వచ్చాక అదేస్థాయిలో అసమానతలు పెరిగాయి. పెట్టుబడుల సాంద్రత పెరిగింది. ఆంధ్ర దళారీ పెట్టుబడిదారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కాంట్రాక్టర్లు మరింత బలపడ్డారు. ఇప్పటికీ కూడా సినిమా రంగం తదితర సాంస్కృతిక ఆధిపత్యాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. తెలంగాణ భాషాభివృద్ధికి గాని ప్రత్యేకంగా సంస్కృతి పరిరక్షణ కానీ చేసిన కృషి తక్కువే. తెలుగు మహాసభలు జరిగాయి. వాటి ప్రయోజనం నెరవేరలేదు. ప్రభుత్వ రంగాలన్నింటి మీద పాత ఆంధ్ర ఆధిపత్య ధోరణుల పడగలాగ పరుచుకునే ఉంది. సెక్రటేరియట్ దాని చుట్టుపక్కల అంబేద్కర్ విగ్రహం, అమరుల స్మృతి చిహ్నం నిజంగానే తెలంగాణలో కొట్టొచ్చినట్టు కనపడిన మార్పు. తెలంగాణ తనాన్ని మాత్రం టీఆర్ఎస్ కాపాడినట్లు కనబడినా ఆంధ్ర ఆధిపత్యం పెరిగిందే గాని తగ్గలేదు.

ఇక ప్రజాస్వామ్య తెలంగాణ భావనలకు సంబంధించి పదేళ్ల టీఆర్ఎస్ ప్రభుత్వంలో కానీ 20 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో కానీ ఒకే తరహా, ఒకే ప్రజాస్వామిక ఉద్యమాన్ని సుదీర్ఘకాలం నడిపిన ఉద్యమపార్టీ అధికారంలోకి వచ్చి రాగానే ఎక్కడైతే ధర్నాలు చేసే తెలంగాణ

సాధించిందో? ఆ ధర్నా చౌక్ ను మూసేసింది. అంతర్గత సమావేశాలను కూడా జరగనివ్వని ఆంక్షలు పెట్టింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్ననోళ్లను మూయించడానికి నిర్బంధం ప్రయోగించింది. టీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులపై ప్రయోగించిన నిర్బంధకాండ, రైతులకు వేసిన బేడీలు అడపాదడపా జరిగిన ఎన్ కౌంటర్లు వారి ప్రజాస్వామ్యపు భండారాన్ని బయటపెట్టింది. ప్రజాస్వామ్య తెలంగాణలో ఆంక్షలు నిర్బంధాలు నిత్య కృత్యమయ్యాయి. రాజకీయ నాయకుల పర్యటనలు జరిగిన ప్రతిసారి ప్రత్యర్థులను, ప్రజాసంఘాలను అరెస్టు చేసే సాంప్రదాయం అప్పుడు ఇప్పుడూ కొనసాగుతూనే ఉన్నది. తెలంగాణ సిద్ధించినాక అప్పటిదాకా క్రియాశీల ఉద్యమ నాయకులుగా ఉన్న చాలామంది కేసీఆర్ ప్రభుత్వంలో చేరిపోయారు. తొలినాళ్లలో ఒక పౌర సమాజం లక్షణాలతో చాలా చేయవచ్చునని కలలు కన్నారు. ఐదేళ్లపాటు నిజంగానే తెలంగాణను ఆంధ్ర ఆధిపత్యవాదుల కుట్రలకు బలికాకుండా రక్షించుకోవడానికి పనిచేశారు. కానీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్ర సమితి సంపూర్ణ మెజారిటీ ఉన్నా ఫిరాయింపులను అధికార పార్టీ ప్రోత్సహించి ఫక్తు రాజకీయశక్తిగా ప్రవర్తించినా ఎవరూ ఏమనలేని మౌనం. పౌర సమాజంలో చురుకుగా ఉన్న తెలంగాణ ఉద్యమకారులు చాలామంది పదవుల్లో ఉన్నందువల్ల పెదవి విప్పలేకపోయారు. సరిదిద్దుకోవాల్సిన విషయాల పట్ల ఉదాసీనంగా వ్యవహరించారు. రాజకీయ నాయకత్వం ఒంటెద్దు పోకడలు, అహంకార పోకడలు, సమూహ నిర్ణయాలు కాకుండా వ్యక్తిగత ప్రాధాన్యతా నిర్ణయాలు, అధికారిక కుటుంబమే అన్నీ అయి నడపడం లాంటి అవలక్షణాల వల్ల నాయకులు ఎంత చెప్పినా, బంగారు తెలంగాణ అని ప్రచారం చేసినా కేసీఆర్‌ను ప్రజలు ఓడగొట్టారు.

టీఆర్ఎస్ లో తెలంగాణ తనం ఉన్నది. తెలంగాణ కోసం కొట్లాడిన వారసత్వం ఉన్నది. కానీ భారతదేశ రాజకీయాల్లో చక్రం తిప్పే లక్ష్యంతో

ఏర్పడిన పార్టీ తనలోని తెలంగాణను వదులుకొని భారత రాష్ట్ర సమితి కావడం కూడా పరాజయాన్ని పరిపూర్ణం చేసింది. కానీ తెలంగాణ కోసం ఏర్పడిన పార్టీ తెలంగాణ ప్రయోజనాలు కాపాడడం కోసం పనిచేసిన పార్టీ కుట్రలను, కుతంత్రాలను తిప్పి కొట్టిన పార్టీ మోడీ లాంటి బలమైన నాయకత్వం ఉన్న బీజేపీని ఢీకొన్న పార్టీ ఇవ్వాళ పరాజయ భారంతో ఉన్నది. జాతిపితగా వెలుగొందిన నాయకుని మీద ఎవరైనా మాట్లాడగలిగే ఒక విరుద్ధ వాతావరణం ఏర్పడింది. ఇది పదేళ్ల పరిణామం. ఇదే అదనుగా కాంగ్రెస్ పార్టీ పుంజుకున్నది. తెలంగాణ ఉద్యమ సందర్భంలో తెలుగుదేశంలో ఉన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావడం కేసీఆర్ కు ధీటుగా ఎత్తుగడలు వేయడం, ప్రజల్లో కేసీఆర్ ప్రభుత్వం పట్ల ఏర్పడిన వ్యతిరేకతను సొమ్ము చేసుకుని ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది. అలవి గాని హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఒక ఉచిత బస్సు హామీ మాత్రం అమలుపరిచింది. పెన్షన్ల పెంపు నుంచి మొదలుకొని చాలా హామీలను తుంగలో తొక్కింది. ప్రత్యర్థుల మీద దాడులు కేసీఆర్ హయాంలో జరిగిన విషయాల మీద విచారణలు ఎదురుదారుల్లో విపరీత భాష, ప్రత్యర్థుల మీద కక్ష సాధింపు చర్యలు నిత్యకృత్యమయ్యాయి. ఎన్‌కౌంటర్లు ఏమీ ఆగలేదు. లగచర్ల నిర్బంధం కాంగ్రెస్ నిజస్వరూపాన్ని బయటపెట్టింది. జయశంకర్ కలలు కన్న తెలంగాణ కేవలం పదకొండున్నర సంవత్సరాలలోనే ఉన్నతమైన ఉద్యమ ఆకాంక్షలకు బదులుగా రెండు రాజకీయపార్టీలు ఆడుకునే ఆటగా మారింది.

ప్రజాస్వామ్య తెలంగాణ లేదు. సామూహిక తెలంగాణ లేదు. ఫక్తు రాజకీయ ఎత్తుగడలు ఎత్తులు జిత్తులు, పై ఎత్తులు ఇది తెలంగాణ సారాంశంగా మారింది. ఆంధ్రా రియల్ ఎస్టేట్ చేతుల్లో ఉన్న భూముల విస్తీర్ణం పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కాంట్రాక్టర్లు కేసీఆర్ ప్రభుత్వంలో బిలియనీయర్లు అయ్యారు. కేసీఆర్ ప్రభుత్వంలో పనిచేసిన కాంట్రాక్టర్లు

రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ప్రాజెక్టులు కడుతున్నారు. అభివృద్ధి నమూనాగా తలసరి ఆదాయం, జీడీపీ పెరుగుదల, సాఫ్ట్‌వేర్ ఎగుమతులు చూపుతున్నారు. కానీ తెలంగాణ సామాన్య జనం బతుకు మారలేదు.

తెలంగాణలో జరగాల్సిన స్వీయ రాజకీయ అధికారం సాంధించాల్సినవి ఏవీ సాధ్యం కాలేదు. పైగా అదే పరాధీన నాయకత్వాలు పెరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త సమస్యలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ తెలంగాణ ఉద్యమంలో ఉన్నప్పటికీ సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చినప్పటికీ ఉద్యమ పరీక్షా సమయాల్లో, రాజీనామాల సమయంలో కాంగ్రెస్ నాయకులు తటస్థులుగా ఉన్నారు. కొందరిని మినహాయిస్తే అటు ఇటు గాని పరిస్థితుల్లోనే ఉన్నారు. ఇక రేవంత్ రెడ్డి పరిస్థితి వేరు. ఆయన తెలంగాణ ఉద్యమంలో లేరు. ఇప్పటివరకు జై తెలంగాణ అనలేదు. పైగా తెలంగాణ ఉద్యమం తీవ్రంగా జరుగుతున్నప్పుడు ఆయన వ్యతిరేకతను ప్రదర్శించారు. అధికారంలోకి వచ్చాక ఆయన తెలంగాణ అస్తిత్వానికి వ్యతిరేకంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. సెక్రటేరియట్లో తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేశారు. కేసీఆర్ నిర్మించిన కట్టడాలపై అక్కసు బహిరంగంగానే ప్రకటించారు. అమరవీరుల స్థూపం, అంబేద్కర్ విగ్రహం గేట్లు తాళాలు మూసే ఉంటున్నాయి. ఇది ఒక ఎత్తు అయితే రానున్న ప్రమాదానికి తెలంగాణలో ఇప్పుడు సూచనలు కనిపిస్తున్నాయి.

ఎన్ని చెప్పుకున్నా తెలంగాణ ప్రయోజనాల విషయంలో కేసీఆర్‌ది రాజీలేని ధోరణి. ఆంధ్రలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో మోడీ ప్రభుత్వం, తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు తెలంగాణ వాదానికి విరుద్ధంగా ఉన్నాయి. కాళేశ్వరాన్ని తప్పుపడుతూనే బనకచర్ల సమావేశంలో అంతరార్థం అర్థం కావడం లేదు. మోడీ తెలంగాణ పట్ల ప్రకటించిన వ్యతిరేకత బహిరంగమే. కేంద్రం నదుల

అనుసంధాన ప్రక్రియ అందరికీ తెలిసిందే. ఇదే అదునుగా గోదావరి జలాల కేటాయింపులు అధికారికంగా ధ్రువీకరించకముందే తెలంగాణ నుంచి సముద్రం నుంచి వృథా అవుతున్న జలాల పేరిట బనకచర్ల కట్టడం, పైగా సముద్రంలోకి వృథా వెళుతున్న జలాలు ఉపయోగించుకుంటే తప్పేంటి? అనడం ప్రమాద హెచ్చరిక. అక్కడ మోడీ ఇక్కడ చంద్రబాబు, ఆయన శిష్యుడు రేవంత్‌ల నిర్ణయాల పట్ల భయమేస్తున్నది. ఇటీవల కాలంలో గద్దర్ అవార్డుల సన్నివేశాలు, రోశయ్య విగ్రహ ప్రతిష్టాపన, బనకచర్ల సందేహాస్పద వైఖరి తెలంగాణకు ముంచుకొస్తున్న ముప్పు సూచనలు. ఏ అస్తిత్వం కోసం అయితే తెలంగాణ నిలబడిందో ఆ అస్తిత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలకు సూచికలివి. ఇవి జయశంకర్ కలలుగన్న చూడకుండా పోయిన తెలంగాణలో ఉద్యమ స్వభావాలు, లక్షణాలు, ఆకాంక్షలు అంతరించిపోయి ఒక ప్రమాదం పొంచి ఉన్నది. దీపం చుట్టూ చేతులు అడ్డం పెట్టుకొని కాపాడుకున్నట్లు తెలంగాణ అస్తిత్వానికి కాపాడుకోవాల్సి ఉన్నది. బహు పరాక్!

'ఔర్ భీ దుఃఖ్ హై జమానేమే మొహబ్బత్ కే సివా'

ప్రపంచంలో ఇప్పటికీ ప్రేమకు మించిన దుఃఖం ఉన్నది.

తెలంగాణ మినహాయింపు కాదు.

జయశంకర్ అనంతరం ఆయన అనుకున్న నమూనాలో అభివృద్ధి సాధించాలంటే ఉద్యమ అభినివేశం, అంకితభావం, నిబద్ధత గల ప్రజాపక్ష రాజకీయాలు రాజ్యమేలాలి'

– అల్లం నారాయణ

BIODATA



Renowned Journalist and Leader in Telugu Media Allam Narayana is a distinguished Indian journalist, poet, writer, and columnist who has significantly contributed to Telugu language journalism. He is the first Chairman of the Telangana Press Academy, where he has demonstrated a strong commitment to journalist welfare and accreditation. Professional Background- Chairman, Telangana Press Academy: Spearheading initiatives for journalist welfare, accreditation, and skill development- Former Chief Editor, Namaste Telangana: Led editorial teams and shaped the newspaper's content and direction. Before Namasthe Telangana Allam Narayana worked with Andhra Prabha and Andhra Jyothi in editorial team and played key role to in that particular news papers.- Founder and President, Telangana Journalist Union: Actively worked for the welfare of journalists and their families Notable Contributions- Columnist, "Pranahitha": Known for his uncompromising, flowery, and fiery language, which has created significant reverberations in society- Literary Contributions: Recognized for his numerous literary works and impact on Telugu literature- Advocacy: Fought for journalist welfare, including financial assistance for families of deceased journalists and provision of house plots Personal Background- Family: Hails from a family of writers and poets, with brothers Allam Rajaiah and Allam Veeriah known for their revolutionary writings- Education: Postgraduate in Sociology with in-depth understanding and spontaneity on various issues. Leadership and Impact Allam Narayana is a respected figure in Telugu journalism, known for his impactful writing and leadership roles in various media organizations. His work has contributed significantly to the growth and development of Telugu language journalism.

Dr. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

